క్లుప్తంగా

కార్మికుల సంక్షేమానికి కృషి



ఆటో డ్రైవర్లను సన్మానిస్తున్న దృశ్యం

పరిగి: రోజంతా ఎంతో కష్టపడి సంపాదించి, కనీసం కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితిలో లేని కార్మికులు ఆటో డ్రైవర్లని బీజేపీ సీనియర్ నాయకుడు బంగారు చంద్ర అన్నారు. శుక్రవారం మండలంలో ఆటో కార్మికులను ఘన సన్మానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో యూనియన్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నరసింహా, ఉమర్ బాషా, వెంకటరెడ్డి, బాబు ప్రసాద్, సంజీవ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు



సచివాలయం వద్ద కంపచెట్లు తొలగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రొద్దం: 'కంప చెట్ల మధ్య సచివాలయం' అన్న శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇందులో భాగంగానే శుక్రవారం సచివాలయం-3 చుట్టూ పేరుకు పోయిన కంప చెట్లను జేసీబీ ద్వారా మొత్తం తొలగించి, పరిసరాలు శుభ్రం చేసినట్లు ఈఓఆర్డీ గోవిందప్ప తెలిపారు. కంపచెట్లు తొలగింపుతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది రఫీక్, సచివాలయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతంలో బార్ వద్దు



టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అర్జీ ఇస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ఆటోనగర్‌కు వెళ్లే రహదారిలో ముసానగర్‌లో నివాస ప్రాంతం, మసీదు, పాఠశాల ఉన్నాయని అక్కడ బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదని మసీద్ ఏ ముసా ముతవల్లి, కమిటీ సభ్యులు, స్థానికులు కోరారు. ఇందులో భాగంగా శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో, ఎక్సైజ్ స్టేషన్‌లో అర్జీలను అందించారు. వారు మాట్లాడుతూ గతంలో ఇదే ప్రాంతంలో బార్ ఉండడంతో మహిళలు, మసీదుకు వచ్చే వారు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.

ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత



రొళ్ల మండలం కె.బ్యాడిగెర వద్ద అక్రమంగా చింత చెట్లను నరికి వేసిన దృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడిగెర సమీపంలో ఓ రైతు వక్కతోట పక్కన ఉన్న కాపుకు వచ్చిన రెండు, మూడు చింత చెట్లను అక్రమార్కులు అడ్డగోలుగా నరికి వేశారు. దీంతో కొందరు గ్రామస్తులు చెట్లు నరికిన ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. గ్రామాల్లో రైతుల పొలాల్లో అడ్డుగా ఉన్న చిన్నా చితక చెట్లను నరికితే ఇట్టే వాలిపోయే అటవీశాఖ అధికారులు ఇంత పెద్ద ఎత్తున చెట్లను పట్టపగలే నరికి వేస్తున్నా ఆ పక్కకు కూడా రాకపోవడం రాకపోవడంపై పెదవి విరుస్తున్నారు.

ధర్నా విజయవంతం చేయండి

పెనుకొండ: సమస్యల పరిష్కారానికై జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా ఫ్యాప్టో నిర్వహించే ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు జిల్లా చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌస్‌లాజం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి మాదేశ్

పావగడ: పెరిగి పోతున్న మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, దీనికి మనమంతా కంకణ బద్ధులు కావాలని స్థానిక జేఎంఎఫ్ న్యాయమూర్తి మాదేశ్ పిలుపు నిచ్చారు. స్థానిక ఐటీఐ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నిరోధం పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు తమకు ఇష్టమొచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారు. పాఠశాలల్లో భోజనం చేయకుండా బయట ప్రాంతంలో ఓ చోట చేసి అన్ని పాఠశాలలకు తరలిస్తున్నారు. మెనూ పాటించకపోవడంతో పాటు విద్యార్థులకు అరకొరగా భోజనం వడ్డిస్తుండటంతో వారు అర్ధాకలితోనే అలమటించాల్సిన దుస్థితి నెలకొంది.



బయట వండిన మధ్యాహ్న భోజనాన్ని బాక్సుల్లోకి వేస్తున్న నిర్వాహకులు



మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలలకు తరలించడానికి సిద్ధం చేసిన బాక్సులు

నిబంధనలకు పాతర

- ఇష్టారాజ్యంగా మధ్యాహ్న భోజన పథకం అమలు
- ఎక్కడో వంట చేసి పాఠశాలలకు తరలిస్తున్న వైనం
- వంటగదులు ఉన్నప్పటికీ వంట చేయని నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు

హిందూపురం టౌన్: నందమూరి బాలకృష్ణ ప్రాతినిత్యం వహిస్తున్న హిందూపురంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నీరుగారుతోంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని వంటగదిలోనే విద్యార్థులకు నిర్వాహకులు మధ్యాహ్న భోజనాన్ని వండి వడ్డించాలి. అయితే హిందూపురం పట్టణంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో అలా జరగడం లేదు. ఎక్కడో వండిన ఆహారాన్ని పాఠశాలలకు తరలించి విద్యార్థులకు వండిస్తున్నారు. దీంతో పథకం నిర్వాహణపై విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు.

8 పాఠశాలలకు ఒకే చోట..

ప్రభుత్వ పాఠశాలల్లో పక్కాగా అమలు కావాల్సిన మధ్యాహ్న భోజన పథకం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా సరైన రీతిలో అమలుకు నోచుకోవడం లేదు. మధ్యాహ్న భోజన నిర్వాహకులను నియమించి విద్యార్థులకు మధ్యాహ్న పథకం భోజనాన్ని అందిస్తున్నారు. నిర్వాహకులు పాఠశాల ఆవరణలోనే వంట వండి మెనూ ప్రకారం రుచికరమైన విద్యార్థులకు మధ్యాహ్నం వడ్డించాల్సి ఉంది. అయితే హిందూపురంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు మాత్రం నిబంధనలు పాతర వేసారు. పట్టణంతో పాటు మండలంలో పలు పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు కుమ్మక్కై కాంట్రాక్టుదారులతో ఎక్కడో బయట ప్రదేశంలో వంట వండించి విద్యార్థులకు తీసుకెళ్లి అందిస్తున్నారు. పట్టణంలో దాదాపు 8 పాఠశాలలకు ఈ పద్ధతిలోనే చేస్తున్నారు. ఒక గోడౌన్ మాదిరి ఉన్న ప్రాంతంలో వంట వండుతూ పాఠశాలలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం నుంచి అందిన బియ్యాన్ని సైతం అక్కడే ఒక చోట నిల్వ చేశారు. బియ్యం సైతం అక్కడి నుంచి పక్కదారి పడుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

విద్యార్థులు అర్ధాకలితో..

పాఠశాలలో కాకుండా బయట వండిన ఆహారాన్ని తీసుకెళ్లి విద్యార్థులకు వడ్డిస్తుండడంతో పాటు ఎలాంటి మెనూను పాటించడం లేదని, విద్యార్థులకు అరకొరగానే భోజనాన్ని అందిస్తున్నారే విమర్శలున్నాయి. బయట నుంచి తెచ్చిన ఆహారం తక్కువ పడితే మళ్లీ తెచ్చి విద్యార్థులు ఇవ్వడం లేదని, పలు పాఠశాల్లో విద్యార్థులు అర్ధాకలితోనే చేతులు కడిగేసే పరిస్థితులు ఉన్నాయని విద్యార్థి సంఘాల నాయకులు వాపోతున్నారు. బయట నుంచి తెచ్చిన ఆహారంతో విద్యార్థులు తిని ఏదైనా జరిగితే ఎవరూ సమాధానం చెబుతారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. బయట నుంచి ఆహారం తెస్తున్న నిర్వాహకులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

సగం పాఠశాలల్లో వంటగదులు కరువు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హిందూపురం పట్టణ, మండల వ్యాప్తంగా 116 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపుగా 60 పాఠశాలలకు మాత్రమే వంట గదులు ఉన్నాయి. మిగతా పాఠశాలల్లో వంట గదులు లేకపోవడంతో మధ్యాహ్న భోజనం పొందడంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంట గదులు ఉన్న పాఠశాలల్లోనే పలు చోట్ల నిర్వాహకులు వంటలు వండకుండా, ఎక్కడో ఇతర చోట్ల వండిన ఆహారాన్ని తీసుకువచ్చి విద్యార్థులు అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆ వంట తినాలంటే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ద్విచక్ర వాహనంలో పాఠశాలలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న భోజనం



మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యాన్ని ఓ చోట నిల్వ చేసిన దృశ్యం

ఫిర్యాదు అందితే చర్యలు

ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు ఉన్నప్పటికీ బయట వేరే చోట్ల వంట వండి విద్యార్థులు అందిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం. పలు పాఠశాలలకు ఒకే చోట వంట వండుతున్నారని వస్తున్న ఫిర్యాదులపై విచారణ చేపడతాం. మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం.

– గంగప్ప, ఎంఈఓ, హిందూపురం

విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం

పెనుకొండ: విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని, ప్రజలపై భారం మోపబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం హామీలను పక్కన పెట్టిందని సీపీఎం నాయకులు విమర్శించారు. సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం వేయడం దారుణమన్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం మండల వ్యాప్తంగా కరపత్రాలను పంపిణీ చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించాలని మంత్రి లోకేష్ ఆదేశాలు ఇవ్వడం ప్రజలకు నమ్మక ద్రోహం చేయడమేనన్నారు. నాయకులు బాబావలి, గంగాధర, మహబూబ్ భాష,హబీబ్, వెంకటేసులు, రాజురావు, సూరి, నాగమ్మ, నరసమ్మ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



ఈరన్నను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అమరాపురం: మండల పరిధిలోని వలస గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈరన్నను శుక్రవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం నుంచి ఈరన్న ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ప్రస్తుతం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న వారు పార్టీ కార్యకర్తలతో కలసి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

'సాక్షి'పై అసత్య ప్రచారాలు మానుకోండి

- వైఎస్ జగన్ వ్యక్తిగత విషయాలపై అంత ఆసక్తి ఎందుకు ?
- హోంమంత్రి అనితపై మండిపడ్డ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: 'పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా నెల్లూరులో జనసముద్రం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే నడిచింది. ఇది జీర్ణించుకోలేని హోంమంత్రి అనిత సాక్షిలో వచ్చిన లైవ్ విజువల్స్‌ను పాత వీడియోలు అసత్య ప్రచారం చేశారు'అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక విమర్శించారు. హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. హోంమంత్రి అనిత.. లైవ్ విజువల్స్‌కు, సాధారణ విజువల్స్‌కు తేడా తెలుసుకోవాలన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి విలువల్లేని మాటలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మొత్తం పోలీసు వ్యవస్థ మీ చేతుల్లోనే ఉందని, ఆ వీడియోలను పాత వీడియోలుగా నిరూపించగలరా అని సవాల్ విసిరారు. అదే విధంగా హోం మంత్రి అనిత మాజీ సీఎం వైఎస్ జగన్ వ్యక్తిగత విషయాల్లోకి జోక్యం చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. న్యాయపరంగా సాధించిన విజయాన్ని కూటమి నేతలు వక్రీకరించి తల్లి, చెల్లిపై సాధించిన విజయంగా పేర్కొనడం వారి బుద్ధిలేనితనానికి నిదర్శనమన్నారు.



మాట్లాడుతున్న సమన్వయకర్త దీపిక

ఇలాంటి విషయాలపై స్పందించే హోంమంత్రి.. ఏనాడైనా రాష్ట్రంలో మహిళలపై జరిగిన అత్యాచారాలపై ప్రెస్‌మీట్లు నిర్వహించారా? వారి కుటుంబాలను పరామర్శించారా? అని ప్రశ్నించారు. కేవలం చంద్రబాబు, లోకేష్ మెప్పుకోసం చేస్తున్న దిగజారుడు వ్యాఖ్యలుగా అందరికీ అర్థమవుతున్నాయన్నారు. రాజకీయంగా ఎక్కడా కనిపించని వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిపై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం భావ్యం కాదన్నారు. వైఎస్ జగన్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను దూషించడం తప్ప హోంమంత్రి అని ఆమె శాఖతో పాటు ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించింది లేదన్నారు. మంత్రిగా ఆమె పూర్తిగా విఫలమయ్యారన్నారు. మీకు బాధ్యత ఉంటే కానిస్టేబుల్‌పై మంత్రి సోదరుడు చేసిన దాడి ఘటనలో ఆయనను అరెస్ట్ చేసి చూపించాలని హితవు పలికారు.

సూపర్ సిక్స్ హామీలు గంగపాలు

చిలమత్తూరు: ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు గంగలో కలిపేశాడని వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి విమర్శించారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండలంలోని చలివెందుల, ఎం.బీరేపల్లి, కగ్గల్లు పంచాయతీల్లో మండల కన్వీనర్ రాము ఆధ్వర్యంలో బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాల్లో వేణురెడ్డితో పాటు రాష్ట్ర కార్యదర్శి మధుమతి రెడ్డి పాల్గొన్నారు. వేణురెడ్డి ఆయా గ్రామాల్లో గడప గడపకూ వెళ్లి చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను వివరించారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటినీ అమలు చేయలేకపోయారని మండిపడ్డారు. మధుమతిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే చంద్రబాబు సూపర్ సిక్స్ అమలు చేసేశానని చెబుతూ ప్రజలకు మోసం చేస్తున్నారని, ఎక్కడ ఏది అమలు చేశారో మాత్రం చెప్పలేక పోతున్నారన్నారు. ప్రజలు ఆలోచించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, ఎస్సీసెల్ సూర్యమోహన్, సర్పంచులు ఉపేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ జట్టి రామకృష్ణారెడ్డి, నాయకులు అప్పిరెడ్డి, రవీంద్రరెడ్డి, దేవరాజు, వరుణ్‌రెడ్డి, మనోజ్, హరి, గుడ్డం వేణు, మూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.



చలివెందులలో కూటమి మోసాలను వివరిస్తున్న వేణురెడ్డి, మధుమతిరెడ్డి

కూటమి మోసాలను ఇంటింటికీ వివరిద్దాం



మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు



గుడిబండ: పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వలస, నిద్రగట్ట గ్రామాల్లో బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతి రెడ్డి, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్‌లతో కలసి ఈరలక్కప్ప మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో సాధ్యంకాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఒక్కహామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలను వంచిస్తున్నాడన్నారు. అదేవిధంగా కూటమి పాలనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఏడాదే అన్ని పథకాలను అమలు చేశాడని గుర్తు చేశారు. ఏం చెప్తారో దాన్నే అమలు చేయడం ఒక్క వైఎస్ జగన్‌కే సాధ్యమన్నారు. కేవలం ఎన్నికల్లో గెలవడానికి సూపర్ సిక్స్‌లు, 143 హామీలను గుప్పించి వాటిని అమలు చేయకుండా మోసం చేసే నాయకుడు దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది కేవలం చంద్రబాబునాయుడేనన్నారు. మోసం చేయడంతో పాటు వెన్నుపోటు పొడవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యన్నారు. ఇలాంటి నాయకుడు చేసిన మోసాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలన్నారు. అనంతరం బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నరసింహమూర్తి, నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి నటరాజు, సర్పంచ్ నాగవేణి హితేంద్ర, ఉప సర్పంచ్ నవీన్, ఎంపీటీసీలు అనసూయ, నారాయణ, సీనియర్ నాయకులు నాగేంద్రప్ప, కరియన్న, ఈరన్న, అశోక్, మంజునాథ, ఈరన్న, దాసప్ప, నాగరాజు, జుంజప్ప, నారాయణప్ప, నాగప్ప, ఇషాక్, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

గుడిబండ: సీఎం చంద్రబాబు మోసానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. మండల పరిధిలోని ముతుకూరు, తాళికెర గ్రామంలో శుక్రవారం 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ 'కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, స్థానిక సర్పంచ్ రంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ కొత్త పింఛన్లు ఇవ్వకపోగా.. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల పింఛన్లు తొలగించా ఆయా కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిని రెడ్‌బుక్ పేరుతో వేధించి అక్రమ కేసులు బనాయించడం తప్ప ఈ ప్రభుత్వానికి మరేమీ చేయలేదన్నారు. సంపద సృష్టిస్తామని గొప్పలు చెప్పి పథకాలు అమలు చేయకుండానే ఏడాదిలోనే ఏకంగా రూ.1.81లక్షల కోట్లు అప్పులు చేసిన చంద్రబాబు తెచ్చిన అప్పు ఎక్కడికి పోయిందో ప్రజలకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి, మహిళా నాయకురాలు అంజలి, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగేంద్ర, అమరాపురం మండల కన్వీనర్ త్రిలోక్, వార్డు మెంబర్ కరియప్ప, నాయకులు రఘు, శివ, శశి, రవి, మురళి, హనుమంతరాయుడు, జయన్న, చంద్రప్ప, మాజీ డీలర్ తిప్పేస్వామి, హనుమంత, హరీష్, రంగనాధ్, ఓబళప్ప, కెంచప్ప, ముద్దన్న, నాగప్ప హలుకూరు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలికల వసతి గృహం తనిఖీ

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని బీసీ బాలికల వసతి గృహాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెడ్‌షీట్లు అందజేశారా? నాణ్యమైన భోజనం, తాగు నీరు తదితర వసతులపై వార్డెన్ సరస్వతిని అడిగి తెలుసుకున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన హెచ్‌ఎం యంజారప్ప, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, నాగనందం, వాణి, శకుంతలమ్మ తదితరులను హెచ్‌ఎం వసంతప్ప ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూబీయానాజ్, వేణుగౌడ్, స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని జిల్లెడుగుంట ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం భూతన్న, ఉపాధ్యాయురాళ్లు సుధారాణి, లలితాలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం షేక్షావలి, ఉపాధ్యాయులు వారి సేవలను కొనియాడారు.

సంక్షిప్త సమాచారం

నేడు బాబు షూరిటీ – మోసం గ్యారంటీ

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి, కంచిసముద్రం గ్రామాల్లో శనివారం 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నిస్సార్ ఒక ప్రకటనలో తెలిపారు. నాయనిపల్లి గ్రామంలో ఉదయం 10 గంటలకు, కంచిసముద్రం గ్రామంలో 11 గంటలకు జరుగుతుందన్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని శుక్రవారం డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజమ్, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్ డిమాండ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం శనివారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జాతీయ రహదారిపై నిరసన

పెనుకొండ: మండలంలోని కురుబవాండ్లపల్లికి చెందిన దళితులు శుక్రవారం హరిపురం వద్ద జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. గ్రామంలోని దళిత వాడకు వెళ్లే రహదారిలో ఉన్న అంబేద్కర్ కాలనీ బోర్డు పక్కకు తొలగించారంటూ జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో బహుజన చైతన్య సమాఖ్య వేదిక నాయకులు శివరామకృష్ణరవి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

బ్లాంకెట్ సర్వేపై అవగాహన

హిందూపురం: మండలంలోని బేవినహళ్లిలో పాడి, సన్నజీవాల రైతులకు బ్లాంకెట్ సర్వేపై పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రం పశువైద్య సహాయకులు షేక్ అబ్దుల్లా రహీం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి, గొర్రెల, మేకల పెంపకం రైతుల నుంచి సమగ్ర సమాచారం సేకరించి, వారి ఆర్థిక అవసరాల నిమిత్తం బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం, పశు బీమా భద్రత, నష్టపరిహారం, సాంకేతిక పరిజ్ఞానం, పశువైద్యం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తోందన్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే !

రొళ్ల: మండలంలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

బస్సు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

మడకశిర: నియోజకవర్గంలో ప్రైవేట్ విద్యాసంస్థలు నడుపుతున్న ఫిట్‌నెస్ లేని కండిషన్‌లో లేని బస్సుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు సీఐ నగేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా చాలా ప్రైవేట్ పాఠశాలల బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారని ఆరోపించారు. బస్సులను తనిఖీ చేసి కండీషన్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలన్నారు.

బ్యాంకుల్లో భద్రతా చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: పట్టణ, పరిసర ప్రాంతాల్లోని బ్యాంకుల్లో తప్పనిసరిగా భద్రతా చర్యలు తీసుకోవాలని వన్ టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బ్యాంకుల్లో తీసుకుంటున్న భద్రతా చర్యలపై బ్యాంకుల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు.

నేడు మెడికల్ అసెస్మెంట్ క్యాంప్

హిందూపురం టౌన్: జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని ఎంజీఎం పాఠశాల ఆవరణలో గల భవితా కేంద్రంలో మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ గంగప్ప పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు వీల్ చైర్స్, సీపీ చైర్స్ ఇస్తామన్నారు. వివరాలకు లలిత 8330971326, నందిని 7674043045 లను సంప్రదించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ

పెనుకొండ: పెనుకొండ మండల నూతన ఎంఈఓగా రాఘవయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓగా పని చేసిన చంద్రశేఖర్ పదవీ విరమణ పొందడంతో నూతన ఎంఈఓగా రాఘవయ్యను అధికారులు నియమించారు.

గుడిబండ: స్థానిక ఎంఈఓగా ప్రసాద్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎమ్మార్సీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.